క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి శాంతినగర్ ఫీడర్‌లో విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పలుప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వి.సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతినగర్, ప్రశాంతినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): నగరంలోని గవర్నర్ పేట -1 డిపో పరిధిలో ఆర్టీసీ సర్వీసులకు సంబంధించి ఫిర్యాదులు, భద్రత ప్రమాణాలు పాటించడానికి ప్రయాణికుల సలహాలు, సూచనలు తెలిపాలని డిపో మేనేజర్ కె. బసవయ్య సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మంగళవారం జరగనున్న డయల్ యువర్ డీఎం.. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య 9959225455కు ఫోన్ చేసి ప్రయాణికులు సూచనలు చేయాలని పేర్కొన్నారు.

20ఎ, 14ఇ బస్సు సర్వీసులను పునరుద్ధరించండి

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం సాంబమూర్తి రోడ్డు మీదుగా 20 ఏ, 14ఇ నంబరు ఆర్టీసీ సిటీ బస్ సర్వీసులను పునరుద్ధరించాలంటూ సోమవారం డాక్టర్ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు వసంతకుమార్ స్పందనలో అర్జీ అందజేశారు. దుర్గాపురం 198వ వార్డు సచివాలయం అడ్మిన్ నాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఆయనతోపాటు ట్రస్ట్ కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడు కొండలు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడుకు చెందిన హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సోమవారం కానూరు, రామవరప్పాడులోని వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ తమ వంతు సామాజిక బాధ్యతగా నిత్యావసర సరుకులు, ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, మల్లిక, వినీల, తేజ, భాష తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠేశ్వరునికి బిల్వార్చన

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీ శివకామేశ్వరీ సమేత నీలకంఠేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం శ్రీ ధర్మపరిషత్ మహాసంస్థాన్ ఆధ్వర్యాన స్వామి వారికి బిల్వార్చన జరిగింది. మహన్యాసపూర్వక ఏక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు.

ముగిసిన దినత్రయ చతుర్వేద మాస పారాయణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో టీటీడీ వేదపారాయణ పథకం ఆధ్వర్యాన వేదపండితులతో ఏర్పాటు చేసిన దినత్రయ చతుర్వేద మాస పారాయణం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా పథకం జిల్లా సూపర్‌వైజర్ గుళ్ళపల్లి శివశర్మ శ్రౌతి మాట్లాడుతూ లోక కల్యాణార్థం ఇక్కడ మూడు రోజుల పాటు పారాయణం ఏర్పాటు చేశామన్నారు.

కళాకారులు సాంస్కృతిక రాయబారులు

విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక రాయబారులు అని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సమతా సేవా సమితి 12 వార్షిక వేడుకలు, వివిధ రంగాల ప్రముఖులకు ఆత్మీయ సత్కారం జరిగింది. రంగస్థల నటుడు, దర్శకుడు ప్రయోక్త డాక్టర్ పీవీఎన్ కృష్ణకు గండపెండేర బహూకరణ కార్యక్రమాన్ని దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కళలు దేశ సాంస్కృతిక వైభవాన్ని చాటుతాయన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్, సంస్థ నిర్వాహకుడు చింతా వెంకటేశ్వర్లు ప్రసంగించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎండీ రెహానా నాహిద్, బుల్లా విజయకుమార్, శీరం శెట్టి పూర్ణ చంద్రరావు, చింతల సాంబయ్య ప్రసంగించారు.

వృత్తి విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): వృత్తి విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా రాష్ట్రంలో స్కిల్ ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందుతుందని వక్తలు పేర్కొన్నారు. వృత్తి విద్యా విధానంలో మెరుగైన అప్రంటీస్ షిప్ లక్ష్యంగా భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో సోమవారం రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆడిటోరియంలో జాతీయ అప్రంటీస్ షిప్ అవగాహన సదస్సు జరిగింది. ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ లావణ్య, ఏడీఆర్ఎం శ్రీకాంత్, ఎస్‌డీఎఫ్ఎం బి.చంద్రశేఖర బాబు, ఎస్‌డీపీఓ బాలమురళీధర్, ఏడీఎఫ్ఎం వెంకటేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్ చంద్రమౌళి, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. సదస్సును ఏడీఎఫ్ఎం వెంకటేశ్వరరావు సమన్వయం చేయగా 187 సంస్థల నుంచి 400కుపైగా ప్రతినిధులు పాల్గొన్నారు.

చురుగ్గా పార్కు పనులు

అందుబాటులోకి రానున్న డాక్టర్ వైఎస్సార్ పార్కు

పాయకాపురం(విజయవాడరూరల్): నగర శివారు వాసులకు ఆహ్లాదం కలిగించడానికి డాక్టర్ వైఎస్సార్ పార్కు త్వరలోనే అందుబాటులో రానుంది. నిత్యం రోజువారి పనులతో బిజీగా గడుపుతున్న పాయకాపురం, కండ్రిక, రాజీవ్‌నగర్, వాంబేకాలనీ, సింగ్‌నగర్ పరిసరప్రాంతాల వాసుల కోసం 14వ ఆర్థిక సంఘం నిధులు, వీఎంసీ నిధులు సుమారు రూ.5 కోట్లతో పాయకాపురంలో పార్కు నిర్మిస్తోంది. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత నగరాన్ని సుందరీకరించడంలో భాగంగా చెరువుగా ఉండే ఈ ప్రాంతాన్ని పార్కుగా అభివృద్ధి చేస్తున్నారు. కోట్లాది రూపాయల విలువ చేసే చెరువు ఆక్రమణలకు గురవకుండా సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి చెరువును అభివృద్ధి చేసేందుకు రెండు సంవత్సరాల క్రితం శ్రీకారం చుట్టారు. 14వ ఆర్థిక సంఘం నిధులు, వీఎంసీ నిధులతో చెరువులో కొంత ప్రాంతాన్ని బోటింగ్ చేసేందుకు, మరి కొంత ప్రాంతాన్ని స్థానికుల కోసం డాక్టర్ వైఎస్సార్ పార్కు ఏర్పాటు చేస్తున్నారు. ఆక్రమణదారుల బారిన పడకుండా ఉండటానికి కోటిన్నరతో ప్రహరీ నిర్మాణం, కోటి రూపాయలతో వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు జరిగినట్టు డీఈ గురునాథం తెలిపారు. రూ. 15 లక్షలతో రకరకాల పూల మొక్కలను చెరువు చుట్టూ ఏర్పాటు చేశామని ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. అతి త్వరలోఈ పార్కు ప్రజలకు అందుబాటులోకి రానుందన్నారు.



పాయకాపురంలో డాక్టర్ వైఎస్సార్ పార్కు

స్థానికులకు ఆహ్లాదం

ఎంతో విలువైన చెరువును ఆక్రమణలకు గురికాకుండా చేసింది ఎమ్మెల్యే మల్లాది విష్ణు. ఆయన ఆలోచనతోనే అధికారులు చెరువును అభివృద్ధి చేసి ప్రజల కోసం పార్కును నిర్మించారు. దీంతో ఆహ్లాదకర వాతావరణం కలుగుతుంది.

–ఉమ్మడి రమాదేవి, కార్పొరేటర్


వాకింగ్ ట్రాక్


రక రకాల మొక్కలతో పార్కు

సమస్యల పరిష్కారానికి స్పందన

వీఎంసీ స్పందనలో 22 అర్జీల స్వీకరణ

పటమట(విజయవాడతూర్పు): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం స్పందన నిర్వహిస్తున్నట్లు వీఎంసీ అధికారులు తెలిపారు. స్పందనలో అదనపు కమిషనర్ (జనరల్) ఎం.శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి. సత్యవతి నగర వాసుల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 22 అర్జీలు రాగా అందులో పట్టణ ప్రణాళిక విభాగం - 3, ఇంజినీరింగ్ - 2, రెవెన్యూ- 7, ప్రజారోగ్య విభాగం - 3, యు.సి.డి (పి.ఒ.)- 7, విభాగాలపై అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి) శకుంతల, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ కె.బి.ఎస్.ఎస్ లత, ఎస్.ఇ. నరసింహ మూర్తి, మేనేజర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


స్పందనలోఅర్జీలు స్వీకరిస్తున్న వీఎంసీ అధికారులు

సర్కిల్ కార్యాలయాల్లో

చిట్టినగర్‌లోని సర్కిల్ - 1 కార్యాలయంలో ప్రజారోగ్య విభాగం - 1, యు.సి.డి (పి.ఒ)- 1, సత్యనారాయణపురంలోని సర్కిల్ - 2లో రెవెన్యూ - 1 అర్జీ, పటమటలోని సర్కిల్ - 3లో ఇంజినీరింగ్ విభాగం - 2, పట్టణ ప్రణాళిక విభాగం-1 అర్జీలు వచ్చాయని జోనల్ కమిషనర్లు తెలిపారు.

లక్ష్యాలకు అనుగుణంగా ఆరోగ్య ప్రగతి

డీఎంహెచ్ఓ మాచర్ల సుహాసిని


ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష చేస్తున్న డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాల్లో లక్ష్యాలకు అనుగుణంగా ప్రగతి సాధించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె నగరంలోని తన కార్యాలయంలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పునరుత్పత్తి శిశు ఆరోగ్యం అప్‌డేట్స్, అభివృద్ధి కమిటీ నిధులు వినియోగంపై మార్గదర్శకాలు, ఫేషియల్ రికగ్నేషన్ సిస్టమ్ అమలు వంటి అంశాలపై సమీక్షించారు. నాన్ కమ్యూనికల్ వ్యాధులు, సాంక్రమిక వ్యాధులు, ఆరోగ్యశ్రీ లబ్దిదారులు ఫీడ్ బ్యాక్ సమరీ కార్యక్రమం అమలు, వంటి విషయాలను విశ్లేషించి లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరసింహనాయక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నళినీదేవి, డీపీఎంఓ డాక్టర్ నవీన్, స్టాటిస్టికల్ అధికారి లక్ష్మోజీ పాల్గొన్నారు.

తీరనున్న ఆర్‌యూబీ సర్వీసు రోడ్డు కష్టాలు

రూ. 19.96 లక్షల వ్యయ అంచనాతో రోడ్డు పనులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ ఆర్‌యూబీ సర్వీసు రోడ్డు కష్టాలు తీరనున్నాయి. ఇక్కడ రైల్వే గేటు వద్ద ఆర్‌యూబీ పనుల్లో భాగంగా సర్వీసు రోడ్డుపై గోతులు పడి, రాళ్లు తేలి ప్రమాదకరంగా మారింది. దీనిపై పలువురు స్పందనలో ఫిర్యాదు చేయడంతో పాటు ఇటీవల ఎమ్మెల్యే మల్లాది విష్ణు నిర్వహించిన పాదయాత్రలో సర్వీసు రోడ్డు కష్టాలపై స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఇప్పటికే ప్రజల అవసరాలకు అనుగుణంగా రైల్వేగేటు ఉత్తరం వైపు రోడ్డును వేయించారు. దక్షిణం వైపు కూడా సర్వీసు రోడ్డు వేయడానికి ప్రతిపాదనలు తయారుచేసి త్వరితగతిన రోడ్డు వేయాలని మల్లాది విష్ణు అధికారులను ఆదేశించారు. అధికారులు ప్రతిపాదనలు తయారు చేయగా రూ. 19.96 లక్షలు మంజూరు చేశారు. సోమవారం రెండు జేసీబీలతో పనులు ప్రారంభించారు. పనులు పూర్తైన తర్వాత సిటీ సర్వీసును మధురానగర్‌కు పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.


జేసీబీతో రోడ్డును సెక్షన్ చేస్తున్న దృశ్యం

బుడమేరు ఆక్రమణల తొలగింపు

పటమట(విజయవాడతూర్పు): స్థానిక 58వ డివిజన్ ఇందిరానాయక్ నగర్, పోస్ట్‌మెన్ రామచంద్రరావు వీధి, 4వ క్రాస్‌రోడ్డులో శనివారం రాత్రి నుంచి ఆర్ఎస్ నం 63లో బుడమేరుకు చెందిన భూమిలో ఆక్రమణలు చేశారని వీటిని తమ సిబ్బంది సోమవారం తొలగించారని వీఎంసీ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. సర్కిల్-2 అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలాజీ పర్యవేక్షణలో విజయవాడ ఉత్తర మండల తహసీల్దారు కార్యాలయం సర్వేయర్‌తో హద్దులు, కొలతలు, సర్వే అనంతరం స్థానిక వీఆర్వో, జలవనరుల శాఖ సమన్వయంతో వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ సారథ్యంలో జేసీబీతో ఆక్రమణను తొలగించామన్నారు. ఆయా శాఖల నుంచి ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా కొనుగోలు చేస్తే భవన నిర్మాణానికి అనుమతి మంజూరు లభించదని, బ్యాంకుల నుంచి లోన్లు రావని, మౌలిక వసతులైన రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు విద్యుత్ సదుపాయం రావని సూచించారు. ఆక్రమణల తొలగింపులో వీఎంసీ ప్లానింగ్ విభాగం వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారన్నారు.


బుడమేరు ఆక్రమణలను తొలగిస్తున్న వీఎంసీ సిబ్బంది

ప్రీతి ఘటనలో నిందితుల్ని శిక్షించాలి

ఏఐఎస్ఎఫ్, ఏపీ మహిళా సమాఖ్య

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తెలంగాణలో ర్యాగింగ్ భూతం బారిన పడి ఆత్మహత్యకు పాల్పడి మరణించిన వైద్య విద్యార్థి ఘటనలో దర్యాప్తు చేసి నిందితుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్), ఏపీ మహిళా సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం స్థానిక లెనిన్ కూడలి వద్ద కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. మెడికో ప్రీతికి నివాళులర్పించారు. ప్రీతి ఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి నిందితుల్ని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మందగళ్ల సాయికుమార్, మహిళా సమాఖ్య నగర ప్రధాన కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, గ్రామిక మహిళా ఫోరం కార్యదర్శి శైలజ మాట్లాడారు. కార్యక్రమంలో విద్యార్థి, మహిళా సమాఖ్యల నాయకులు మోతుకూరి అభ్యుదయ, అయ్యప్ప, ఓర్సు భారతి, దుర్గాసి రమణమ్మ, తమ్మిన దుర్గాంబ, డి సీతారావమ్మ, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.


ప్రీతి ఘటనలో నిందితుల్ని కఠినంగా శిక్షించాలని కోరుతూ కొవ్వొత్తుల ప్రదర్శన

యూనియన్ నేతపై ఫిర్యాదు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): నకిలీ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌తో రైల్వే శాఖను మోసం చేసిన మజ్దూర్ యూనియన్ నేతపై ఫిర్యాదు చేశారు. ఆ సంఘ నేత అసలు డేట్ ఆఫ్ బర్త్ ప్రకారం మరో రెండు నెలల్లో రిటైర్డ్ కావాల్సి ఉండగా, తప్పుడు సర్టిఫికెట్‌తో మరో ఏనిమిదేళ్లు అధికారాన్ని అనుభవించేందుకు పక్కాగా ప్లాన్ చేసుకున్నాడు. అదే యూనియన్‌లో వారు ఈ విషయాన్ని బయటపెట్టడంతో డొంక కదిలింది. దీనిపై రైల్వే విజిలెన్స్, పీసీఓ ఉన్నతాధికారుల వాస్తవాలను వెలికితీసేందుకు రంగంలోకి దిగినట్లు సమాచారం.

నైపుణ్యం పెంచుకుని అవకాశాలు వినియోగించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకుని వచ్చిన అవకాశాలను వినియోగించుకోవాలని సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నీరజ సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని గురుకుల కళాశాలలో సోమవారం మాతృభాషా దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచి మంత్రి బొత్స సత్యనారాయణ నుంచి పురస్కారం అందుకున్న విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన రుషిత, వర్ష క్విజ్‌లో, వెంకటలక్ష్మి, ప్రేమ వ్యాసరచన పోటీల్లో పురస్కారం అందుకోవడం కళాశాలకే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కె. బాలకృష్ణ, అరుణ, సుమిత్ర, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజన

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థుల్లో సృజన పెంపొందించేందుకు సైన్స్ ఎక్స్‌పోలు దోహదపడతాయని వైఎస్సార్ సీపీ 37వ డివిజన్ ఇన్‌చార్జి ఇసరపు రాజు అన్నారు. ముత్యాలంపాడు ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో సోమవారం సీవీ రామన్ జయంతి పురస్కరించుకుని వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. సుమారు 300 ప్రదర్శనలను వివరించారు. కార్యక్రమంలో స్కూలు సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు

పాయకాపురం(విజయవాడరూరల్): అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని లబ్ధిదారులు తెలిపారు. 64వ డివిజన్ 284వ వార్డు సచివాలయ పరిధిలో సోమవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. బర్మా కాలనీలో 308 గడపలను సందర్శించారు. లబ్ధిదారులు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న పథకాలతో ఆర్థిక ఇబ్బందులు తొలగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ మూడున్నరేళ్లలో సచివాలయ పరిధిలో రూ.7.15 కోట్ల సంక్షేమాన్ని నేరుగా లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాలకు జమ చేసినట్లు వెల్లడించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. ప్రభుత్వం అందిస్తోన్న సాయంతో సోమాద్రి పద్మావతి అనే మహిళ కిరాణా దుకాణం ప్రారంభించి చిరు వ్యాపారంలో రాణించడం ఎంతగానో ఆనందం కల్గించిందన్నారు.


బర్మాకాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణు

నారా లోకేష్ మాటలకు ప్రజల్లో విలువ లేదన్నారు. కార్యక్రమంలో డీఈ రామకృష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరావు, సీడీఓ జగదీశ్వరీ, వైసీపీ డివిజన్ కోఆర్డినేటర్ ఎస్‌కే ఇస్మాయిల్, అధ్యక్షులు జె.శివ నాయకులు యర్రగొర్ల శ్రీరాములు, పందిరి వాసు, అనిల్, కొక్కిలిగడ్డ నాని తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనర్థాలు

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరించి, విష సంస్కృతికి దూరంగా ఉండేలా విద్యార్థుల్లో చైతన్యం పెంచాలని కలెక్టర్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. ఇటీవల విభిన్న ప్రతిభావంతులకు నిర్వహించిన ఆటల పోటీల్లో సేవలందించిన కానూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు సోమవారం కలెక్టర్ ఢిల్లీరావు ఆయన కార్యాలయంలో ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంకేతిక విజ్ఞానాన్ని కొందరు విద్యార్థులు చెడు వ్యసనాలకు ఉపయోగిస్తూ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్, విద్య, వైద్య ఆరోగ్య, మహిళాభివృద్ధి, సాంఘిక సంక్షేమం తదితర శాఖల అధికారుల సమన్వయంతో జిల్లాలోని కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించి మత్తుపదార్థాల వినియోగాన్ని అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఔత్సాహికులైన విద్యార్థులు బృందాలుగా ఏర్పడి విద్యార్థుల ముఖ కవళికలు, ఆరోగ్యపరమైన మార్పులను గమనించి వారి ప్రవర్తనలో మార్పు తీసుకువస్తే నిజమైన స్నేహితులుగా మిగిలిపోతారన్నారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాల పంపిణీలో విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు రామకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.


కళాశాల విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

త్వరితగతిన ఎక్సెల్‌ప్లాంట్ పనులు

పటమట(విజయవాడతూర్పు): త్వరితగతిన ఎక్సెల్ ప్లాంట్ పనులు పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్ ఆదేశించారు. అజిత్‌సింగ్‌నగర్ ఎక్సెల్‌ప్లాంట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్లాంట్ ఆవరణలో మిగిలిన సి.సి.రోడ్లను వేయాలని, కొత్తగా ఆఫీసు బిల్డింగ్ నిర్మించాలన్నారు. కర్లాన్ ఇండస్ట్రీస్ నిర్వహణలోని చెత్త వేయింగ్ (వే బ్రిడ్జి) పని తీరును పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. ప్లాంట్ ఆవరణలో ప్రహరీ పక్కన ఏర్పాటు చేసిన గ్రీనరీని మరింత పెంచాలని, ఖాళీ ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో మొక్కలు నాటాలని ఆదేశించారు. అనంతరం ఆయన సర్కిల్-2 పరిధిలో సత్యనారాయణపురంలో అభివృద్ధి చేసిన సి.సి. రోడ్లను రీబౌండ్ హ్యామర్‌తో పనుల నాణ్యత పరిశీలించారు. ఆయా రోడ్లలో జరుగుతున్న డ్రైన్ పనులను వేగంగా చేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి. సత్యవతి, జోనల్ కమిషనర్-2 యు.స్వజన, ఈఈలు సత్యనారాయణరావు, ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, ఏడీహెచ్ శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.


ఎక్సెల్‌ప్లాంట్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పన్నుల చెల్లింపునకు ప్రత్యేక క్యాష్ కౌంటర్లు

పటమట(విజయవాడతూర్పు): నగరవాసులు 2022-23 ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన ఆస్తి, నీటి, డ్రైనేజీ, ఖాళీస్థలాల పన్నులు చెల్లింపునకు పలు క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పన్నులు చెల్లించని వారి నీటి కుళాయి కనెక్షన్ తొలగించి ఆస్తులు జప్తునకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

సర్కిల్–1 పరిధిలో...

సర్కిల్–1 పరిధిలోని హెచ్‌బీ కాలనీలో (భవానీపురం ఓల్డ్ పోలీస్‌స్టేషన్) క్యాష్ కౌంటర్, చిట్టినగర్‌లోని సర్కిల్–1 కార్యాలయంలో రెండు క్యాష్ కౌంటర్లు, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులోని సచివాలయం నంబరు 130లో ఒక క్యాష్ కౌంటర్, గొల్లపాలెం గట్టు వద్ద ఉన్న సచివాలయం 225లో, బీఆర్‌పీ రోడ్డులోని సీఎస్ఐ చర్చి ఎదురుగా ఉన్న 118, వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఒక క్యాష్ కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు.

సర్కిల్–2 కార్యాలయం పరిధిలో...

సత్యనారాయణపురంలోని సర్కిల్–2 కార్యాలయంలో మూడు క్యాష్ కౌంటర్లు, పాయకాపురం ప్రకాష్‌నగర్‌లోని సచివాలయంలోని 269లో, అజిత్‌సింగ్‌నగర్‌లోని ఆంధ్రప్రభ కాలనీలోని సచివాలయం 259లో, గవర్నర్‌పేటలోని వీహెచ్ఆర్ కాంప్లెక్‌లోని సచివాలయం నంబరు 98లో, మధురానగర్‌లోని సచివాలయం 205లో, పాయకాపురంలోని ప్రకాష్‌నగర్ అప్నా బజార్, వాటర్‌ట్యాంక్ వద్ద క్యాష్ కౌంటర్ నంబరు 7,8,9లో చెల్లించవచ్చన్నారు.

సర్కిల్–3 పరిధిలో...

బ్రహ్మానందరెడ్డినగర్‌లోని సచివాలయం నంబరు 32లో, లబ్బీపేట మలేరియా ఆస్పత్రిపైన ఉన్న సచివాలయం నంబరు 86లో, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలోని సచివాలయం నం 8లో, కృష్ణలంక సిమెంట్ గొడౌన్ వద్ద ఉన్న సచివాలయం నంబరు 83లో, స్టెల్లా కళాశాల వద్ద, సాయిబాబా గుడివద్ద ఉన్న వీఎంసీ క్యాష్ కౌంటర్, కృష్ణలంకలోని 102 సచివాలయంలో, గుణదల ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద ఉన్న వీఎంసీ క్యాష్ కౌంటర్‌లో, పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలో మూడు క్యాష్ కౌంటర్లలో పన్నులు చెల్లించవచ్చన్నారు.